క్లుప్తంగా

ప్రజలపై భారం మోపడం తగదు



నరుకూరు సెంటర్‌లో ప్రజాపోరు కార్యక్రమం

తోటపల్లిగూడూరు: ప్రజలపై విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారం మోపడం తగదని సీపీఎం మండల నాయకులు మారుబొయిన రాజా అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నరుకూరు సెంటర్‌లో ప్రజాపోరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు బాగా పెరిగాయన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల పేరిట రూ.11 వేల కోట్ల భారాన్ని మోపేందుకు సిద్ధమవుతోందన్నారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వ జెన్కో ప్లాంట్ల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయకుండా కమీషన్ల కోసం ప్రైవేట్ కంపెనీల నుంచి కొనుగోలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, నాయకులు వేగూరు వెంకయ్య, గోపీ, నాశిన పరశురామయ్య, అన్నం పుట్టయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం



బుచ్చిరెడ్డిపాళెం: ఇసుకను తరలిస్తున్న టర్బో లారీని పట్టణంలో ఎస్సై సంతోష్‌రెడ్డి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సంగంలోని రీచ్ నుంచి ఇసుక లోడుతో ఒంగోలు వెళ్తున్న లారీని అదుపులోకి తీసుకొని జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులకు సమాచారమిచ్చారు.

14న తహసీల్దార్ కార్యాలయ ముట్టడి



సీపీఎం నేతల ఇంటింటి ప్రచారం

కొడవలూరు: ఈ నెల 14న నిర్వహించనున్న తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నేతలు కోరారు. మండలంలోని యల్లాయపాళెంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాపోరు పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. చివరి రోజున తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నామని పేర్కొన్నారు. పార్టీ మండల నేతలు భూలోకం కాంతారావు, మహబూబ్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్టు జోరు

'గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు లేకుండా చూస్తాం. ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' ఇవీ ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ అధికారులు నిత్యం చెబుతున్న మాటలు. ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటైన తర్వాత అధికార పార్టీ అండతో గ్రామాల్లో విచ్చలవిడిగా గొలుసు దుకాణాల్లో అమ్మకాలు సాగుతున్నాయి. మామూళ్ల మత్తు, కూటమి నేతల ఒత్తిడితో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

- కూటమి ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే..
- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా మద్యం గొలుసు దుకాణాలు
- కేసుల నమోదు నామమాత్రం
- టీడీపీ నేతల ఇష్టారాజ్యం



వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని మార్చింది. దీంతో ప్రైవేట్ మద్యం షాపులు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఊరూరా బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. మండలాల్లో వాటర్‌ప్లాంట్ లేని పల్లెలు అక్కడక్కడా ఉన్నాయని, బెల్టు దుకాణం లేని ఊరు లేదని మహిళలు మండిపడుతున్నారు.

ఎన్నంటే..

నియోజకవర్గంలోని వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో 28 ప్రైవేట్ మద్యం దుకాణాలున్నాయి. వాటికి అనుబంధంగా సుమారు 550 బెల్టు షాపులు వెలిశాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండటంతో ఎక్కడా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించలేదు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు విచ్చలవిడిగా బెల్టు షాపులకు తెర లేపారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో షాపు ఏర్పాటుకు రూ.15 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేశారు. పలుచోట్ల వేలంపాటలు నిర్వహించి మరీ అప్పగించారు. వీటిల్లో ఎమ్మార్పీ ధర కంటే రూ.30 నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

కేసుల నమోదు లేదు

గ్రామాల్లో బెల్టు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు. షాపు నిర్వహించే వ్యక్తిని జైలుకు పంపడంతోపాటుగా, ఏ మద్యం దుకాణం నుంచైతే బాటిళ్లు తెచ్చి అమ్ముతున్నారో దాని లైసెన్స్ రద్దు చేస్తామని ప్రకటనలిస్తున్నారు. అయితే నియోజకవర్గంలో 116 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్నింట్లో బెల్టు షాపులు భారీ సంఖ్యలో ఉన్నాయి. రేయింబవళ్లు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. దీనిపై మహిళలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. బెల్టు షాపులతో తమ కుటుంబాలు నాశనమవుతున్నాయని ఎక్సైజ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసిన సందర్భాలున్నాయి. అయితే కూటమి నేతల ఒత్తిడితో యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఉదాహరణకు..



బెల్టు దుకాణంలో మద్యం బాటిళ్లు

వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి, పుంజులూరుపాడు, కసుమూరు, చెముడుగుంట, గొలగమూడి క్రాస్‌రోడ్డు మద్యం దుకాణల పరిధిలోని గ్రామాల్లో 115కు పైగా బెల్టు షాపులున్నా ఇప్పటి వరకు కేవలం ఐదు కేసులు మాత్రమే నమోదయ్యాయి. అధికారులకు సమాచారం ఇచ్చినా.. తనిఖీలకు వచ్చిన ఎక్సైజ్ సిబ్బంది బెల్టు షాపు నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనుబోలు మండలంలో 60కు పైగా బెల్టు షాపులుండగా.. ఆరు కేసులు నమోదయ్యాయి. పొదలకూరు మండలంలో 150కుపైగా ఉండగా ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా పెట్టలేదు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.



కసుమూరులో బెల్టు దుకాణాన్ని మూత వేయించిన ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

బీసీ కులగణనను చేపట్టాలి

తోటపల్లిగూడూరు: రాష్ట్రంలో బీసీ కులగణనను వెంటనే చేపట్టాల్సిన అవసరం ఉందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకీప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సాలిపేట, మల్లికార్జునపురం, కోడూరు, వెంకన్నపాళెం, మహాలక్ష్మీపురం, కొత్తపాళెం, విలుకానుపల్లి, చింతోపు గ్రామాల్లో ఆదివారం బీఎస్పీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులగణనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలస్యం చేస్తున్నాయన్నారు. కులగణను చేపట్టాలంటూ బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్లో ధర్నా చేస్తామన్నారు. ఇందులో బీసీ నాయకులు, కుల సంఘాల పెద్దలు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్, సీనియర్ నాయకులు ఎం బేటి శ్రీనివాసులు, మర్రి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని శివాలయంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం జరిగింది. రూ.40 వేలకు నాగార్జున స్కూల్ యాజమాన్యం దక్కించుకున్నారు. విఘ్నేశ్వరస్వామి లడ్డూను మధుర కేటరింగ్ నిర్వాహకుడు రూ.25 వేలకు, సుబ్రహ్మణ్యం స్వామి లడ్డూను రూ.10 వేలకు కృష్ణారెడ్డి దక్కించుకున్నారు.

ప్రసన్నను కలిసిన నేతలు





అభినందనలను తెలియజేస్తున్న నేతలు

కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు.

➡ కొడవలూరు మండలం మిక్కిలింపేట మాజీ సర్పంచ్ జూటూరు వెంకటకృష్ణారెడ్డి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

➡ విడవలూరు మండలం వరిణి సర్పంచ్ రావిళ్ల మల్లికార్జునరావు, ఎంపీటీసీ భక్తవత్సలయ్య, వార్డు సభ్యులు బండ్ల వెంకయ్య, వెంకయ్య, బద్దిపూడి వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు.



➡ ఇందుకూరుపేట మండలం పల్లిపాడు నేతలు రమేష్‌రెడ్డి, మల్లి, సురేష్, వెంకటేశ్వర్లు కలిశారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం

- సీపీఎం నాయకుడు మోహన్‌రావు

ముత్తుకూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతున్నందుకు నిరసనగా ఈనెల 14వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం' అని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు ఎం.మోహన్‌రావు వెల్లడించారు. ముత్తుకూరు శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం మండల 6వ మహాసభలో ఆయన పాల్గొన్నారు. పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తామన్నారు. కంటైనర్ టెర్మినల్ సాధనకు పోరాటం చేస్తామన్నారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శిగా గడ్డం అంకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా ఎనిమిది మంది నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు గోగుల శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు నక్కా రాధయ్య, బ్రహ్మదేవి మోహన్‌రావు, చేవూరు మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రావు

ఆక్రమణపై కమిషనర్‌కు ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి నగర్‌లో గల లేఅవుట్లో ఓ బ్యాంక్ ఉద్యోగి తన ఇంటి ముందు ఉన్న రోడ్డు స్థలంలో కారు షెడ్డును నిర్మించి ఇబ్బంది పెడుతున్నారని కాలనీ వాసులు ఆరోపించారు. ఈ మేరకు కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. 45 అడుగుల రోడ్డులో ఆక్రమణ జరపడంతో ఇబ్బందిగా ఉంటోందని పేర్కొన్నారు.

ఇతర జిల్లాలకు ఇసుక అక్రమ రవాణా

- లారీ, టిప్పర్ పట్టివేత

కొడవలూరు: ఇతర జిల్లాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, టిప్పర్‌ను కొడవలూరు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి పట్టుకున్నారు. రాత్రివేళల్లో ఇతర జిల్లాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై నార్తురాజుపాళెం హైవేపై కామాక్షి హోటల్ వద్ద శనివారం రాత్రి కాపు కాశారు. అర్ధరాత్రి బుచ్చి రోడ్డులో నుంచి హైవేపైకి చేరుకున్న ఇసుక లారీ, టిప్పర్‌ను ఆపారు. వివరాలు ఆరా తీయగా గుంటూరు జిల్లాకు వెళ్తున్నట్లు గుర్తించారు. సంబంధిత పత్రాలు పరిశీలించి అనుమతుల్లేవని నిర్ధారించారు. అనంతరం ఆ రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

వెంకటాచలం: మండలంలోని ఈదగాలి గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని పొలాల వద్ద పేకాట శిబిరం ఏర్పాటు చేశారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దాడులు చేపట్టారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొట్టిన మోటార్‌బైక్

- వ్యక్తి మృతి



చంద్ర మృతదేహం

మనుబోలు: మోటార్‌బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు బైపాస్‌రోడ్డులోని కండలేరు వంతెనపై శనివారం అర్ధరాత్రి జరిగింది. ఆదివారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఇందుకూరిపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన తూపిలి చంద్ర (44) స్వర్ణకారుడు. ఆర్డర్‌పై తయారు చేసిన బంగారు నగలను గూడూరులో ఇచ్చి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. కండలేరు వంతెనపై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

- టీడీపీ నేతల సమక్షంలో వేలంపాట
- సర్పంచ్, అధికారులకు సమాచారమివ్వని వైనం



వేలం పాట

మనుబోలు: మండలంలోని కొలనకుదురు గ్రామ పరిధిలోని రెండు దొరువులు, ఒక వాగులో చేపలు పట్టుకునే హక్కుల కోసం గ్రామంలో ఆదివారం వేలంపాట నిర్వహించారు. అయితే సర్పంచ్, అధికారుల ఆధ్వర్యంలో జరగాల్సిన ఈ ప్రక్రియ గురించి వారికి సమాచారం ఇవ్వకుండానే స్థానిక టీడీపీ నాయకుల సమక్షంలో శివాలయం వద్ద నిర్వహించారు. ఈ హక్కులను ముగ్గురు వ్యక్తులు రూ.89 వేలకు దక్కించుకున్నట్లు సమాచారం. దీని నిర్వహణపై గ్రామస్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏకాభిప్రాయం కూడా లేకుండా, సర్పంచ్, అధికారులకు సమాచారం ఇవ్వకుండా కేవలం అధికార పార్టీకి చెందిన వారే వేలం నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



గ్రామంలోని దొరువులు, వాగులో చేపలు పట్టుకునేందుకు వేలంపాట నిర్వహించేందుకు నాలుగు రోజుల ముందే అధికార పార్టీ నాయకులు దండోరా వేయించారు. సర్పంచ్ అయిన నాకు సమాచారం ఇవ్వలేదు. దీంతో ఈ విషయాన్ని అప్పుడే ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లాం.

– తూపిలి వెంకటరమణయ్య, సర్పంచ్, కొలనకుదురు

ఆదేశించాం

అధికారులు, సర్పంచ్‌కు తెలియకుండా వేలంపాట నిర్వహించడం చట్ట వ్యతిరేకం. కొలనకుదురులో చేపలు పట్టేందుకు వేలం నిర్వహించిన దొరువులు, వాగు ఉన్న భూమి ఏ పరిధిలోకి వస్తుందో విచారించి చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీని ఆదేశించాం.

– జలజాక్షి, ఎంపీడీఓ

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

పొదలకూరు: ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర అపస్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక కాకతీయ జూనియర్ కాలేజీలో ఆదివారం అపస్మా సర్వేపల్లి నియోజకవర్గం, రాపూరు యూనిట్ ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాల్సిందిగా సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాద్రి, సర్వేపల్లి అధ్యక్షుడు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు అమరావతి సురేష్, రాపూరు కార్యదర్శి మహేష్, నెల్లూరు సిటీ ఉపాధ్యక్షుడు హరినాథ్, సెక్రటరీ పద్మ, మోటివేటర్ కృష్ణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

గురుకులం వద్ద పేరెంట్స్ సందడి

ముత్తుకూరు: మండల కేంద్రమైన ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం కోలాహలంగా పేరెంట్స్ సండే కార్యక్రమం జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచి తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలతో సంతోషంగా గడిపారు. వీరి రాకతో ఆటోలు, బస్సులు కిటకిటలాడాయి. పరిసర దుకాణాలు కిక్కిరిసిపోయాయి.



గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రులు

ఏమరుపాటుగా ఉంటే అంతే..!

- ప్రమాదభరితంగా మ్యాన్ హోల్స్
- జాతీయ రహదారి మధ్య డివైడర్లపై ఇదీ పరిస్థితి
- మూతలు వేయడాన్ని విస్మరించిన హైవే అథారిటీ
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు



రామన్నపాళెం వద్ద డివైడర్ మధ్య మ్యాన్ హోల్



కోవూరు నందలగుంట వద్ద ఇలా..

కొడవలూరు: జాతీయ రహదారిపై డివైడర్ల మీదుగా దాటే సమయంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. డివైడర్లపై ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రమాదభరితంగా మారాయి. ఎలాంటి మూతలు వేయకుండా వదిలేయడం.. పచ్చిక, పిచ్చి మొక్కల పెరిగి ఇవి కనిపించడంలేదు. ఫలితంగా ఇందులో పడి నిత్యం ఎవరో ఒకరు గాయపడుతూనే ఉన్నారు.

వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు

వాస్తవానికి హైవే డివైడర్లపై వర్షపు నీరు ప్రవహించేందుకు వీలుగా 50 మీటర్లకో మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీటిని మూసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వీటిలోతు సుమారు పదడుగుల నుంచి 12 అడుగుల వరకు ఉంది. రోడ్డు దాటే సమయాల్లో పలువురు పడి గాయపడుతున్నారు. తాజాగా రామన్నపాళెం సమీపంలో కార్మికుడు శ్రీనివాసులు బస్సు దిగి ఫ్యాక్టరీకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, మ్యాన్ హోల్లో గత మంగళవారం పడి గాయపడి ఆస్పత్రి పాలయ్యారు.

ప్రమాదాలను కొని తెచ్చుకుంటూ..

ఇటీవలి కాలంలో హైవేపై వ్యాపారాలు అధికమయ్యాయి. టెంకాయలు, పండ్లు, టోపీలు, కళ్లద్దాలు, హోటళ్లు ఇలా అనేక రకాల వ్యాపారాలు వెలిశాయి. వీటిని కొనుగోలు చేసే క్రమంలో రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు హైవే డివైడర్లపై పూల మొక్కలు, గోరింటాకు చెట్లను వేశారు. వీటి కోసం మహిళలు వస్తుంటారు. వీరు సైతం ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. సమస్యను హైవే అథారిటీ అధికారులకు తెలియజేసినా, వారు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇనుప మెష్‌ను పెట్టడం లేదా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్లక్ష్యాన్ని వీడాలి



హైవే డివైడర్లపై ఉన్న మ్యాన్ హోల్స్ కారణంగా తరచూ ఎవరో ఒకరు గాయపడుతూనే ఉన్నారు. వీటిపై మెష్‌ను ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు ఎన్నో ఫిర్యాదులందాయి. అయినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలి.

– జనార్దన్‌రెడ్డి, నార్తురాజుపాళెం

సమస్యను పరిష్కరించాలి



డివైడర్లపై మ్యాన్ హోళ్ల సమస్యను అధికారులు పరిష్కరించాలి. ఇనుప మెష్‌ను ఏర్పాటు చేసినా, వర్షపు నీరు యథావిధిగా మ్యాన్ హోళ్లలోకి వెళ్తుంది. ఈ దిశగా అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– శ్రీనివాసులు, నార్తురాజుపాళెం

మాజీ మంత్రి కాకాణి పుట్టిన రోజు వేడుకలు

వెంకటాచలం: మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం వెంకటాచలంలోని సెయింట్ జ్యాడ్స్ మానసిక వికలాంగుల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య కేక్ కట్ చేశారు. చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోట్లూరు సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు అడపాల ఏడుకొండలు, కడివేటి శివ, నాయకులు తాటిపర్తి సురేష్, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: కేక్ కట్ చేస్తున్న మందల వెంకటశేషయ్య

➡ **పొదలకూరు:** పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో ఉన్న వృద్ధుల ఆశ్రమంలో కాకాణి జన్మదిన వేడుకలను నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వార్డు సభ్యులు ఎస్‌కే అంజాద్, హరి, హేమంత్, నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, గౌస్ పాల్గొన్నారు. మరుపూరులో వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. మాజీ సర్పంచ్ వళ్లూరు గోపాల్‌రెడ్డి, కలిచేటి రామిరెడ్డి, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొగళ్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ సీహెచ్ విజయలక్ష్మి పాల్గొన్నారు. నేదురుమల్లిలో సర్పంచ్ ఉడతా రమేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

➡ **మనుబోలు:** మనుబోలులో నాయకులు కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంగమేశ్వర గిరిజన కాలనీలో కేక్ కట్ చేశారు. కొమ్మలపూడిలో సర్పంచ్ బందెల వేణుగోపాల్, జట్లకొండూరులో ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్‌ల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, నవకోటి, మణి, దయాకర్, భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరగౌడ్, సుధాకర్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, గిరి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: వృద్ధాశ్రమంలో..



పొదలకూరు: మరుపూరు గ్రామంలో..



మనుబోలు: సంగమేశ్వరాలయం వద్ద నేతలు